

పాఠశాలల్లో పనులను వెంటనే పూర్తి చేయాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూన్ 15: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఇంజనీర్‌లు, విద్యాశాఖాధికారులతో అమ్మఆదర్శ పాఠశాలల కమిటీ కింద మిగిలిపోయిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నాలుగురోజులు పూర్తయ్యాయని, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. వర్షాకాలంలో పాఠశాల భవనాల పైకప్పు నీరు ఊరిస్తే నాణ్యమైన డాంబర్ షీట్‌ను అతికించాలని తెలిపారు. పైకప్పు మరమ్మతు పనులు వారం రోజుల్లోగా పూర్తవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు అమ్మఆదర్శ పాఠశాలలకింద చేపట్టి పనుల ఎంబీ రికార్డులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్‌సరఫరాలేని పాఠశాలల వివరాలను సమర్పించాలని తెలిపారు. ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందించనిచోట త్వరగా అందించాలన్నారు. పనుల పురోగతిపై విద్యాశాఖ అధికారులను, ఇంజనీర్‌లను మండలాల వారీగా అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో కూడా అమ్మఆదర్శ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుని పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్, జిల్లాగిరిజన సంక్షేమాధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఇంజనీర్‌లు, విద్యాశాఖాధి కారులు పాల్గొన్నారు.

బస్సు, కారు ఢీ: ఇద్దరికి గాయాలు



ఢీ కొన్న కారు, ఆర్టీసీ బస్సు

కెరమెరి, జూన్ 15: మండలంలోని ఘాట్ రోడ్డులో శనివారం కారు, ఆర్టీసీబస్సు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఉట్నూరు నుంచి ఆసిఫాబాద్‌వైపు బస్సున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 18టి 7799), గోలేటి నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న కారు (టీఎస్ 20సి 6682) కెరమెరి ఘాట్‌పై ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న శేక్ సమీర్, మరో మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. కారు డ్రైవర్ శేక్ సమీర్ ఫిర్యాదు మేరకు బస్సుడ్రైవర్ రాహుల్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. కాగా ఇదేఘాట్‌పై వారంరోజుల క్రితం జైనూరు మండల పరిధిలో రెండు లారీలు సైతం బోల్తాపడ్డాయి.

విత్తన ఎంపికే ప్రధానం



వానాకాలం సీజన్ ప్రారంభమైంది. తొలకరి పలకరించడంతోపాటు నైరుతి రుతుపవనాల ప్రభావంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. పంటల సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవడం ఎంతో ప్రధానం. కానీ తరచూ నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. ▪ బెజ్జూరు

- మేలు రకంతో అధిక దిగుబడులు
- నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

జిల్లాలో పలు ప్రైవేటు విత్తన కంపనీలు నాణ్యత లేని విత్తనాలను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో, నకిలీ లేబుళ్లతో రైతులను మోసం చేస్తున్నాయి. ఇటువంటి విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకొని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి దిగుబడులు సాదించాలి. మేలు రకం విత్తనాలను రైతులు కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. మంచి విత్తనం అంటే శుభ్రత, నాణ్యతతో పాటు బాగా మొలకెత్తే స్వభావం ఉండాలి. ప్రతీ రైతు తనకు తానే నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. పరిశోధనా సంస్థల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో రూపొందించే బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. ఈ ఫౌండేషన్ విత్తనాల నుంచి సర్టిఫైడ్ విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. రైతులు ఈ విత్తనాలను వాడాల్సి ఉంటుంది. సర్టిఫైడ్స్ సీడ్స్ జన్యుపరంగా మంచి లక్షణాలు ఉంటాయి.మొలకశాతం ఎక్కువగా ఉంటుంది. రోగ కారకమైన శిలీం ధ్రాల బెడద ఉండదు. అలాంటి విత్తనాలతో పండించిన పంటల నుంచి విత్తనోత్పత్తి చేసుకొని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

● టీజీ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ..

వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన మేలురకం వరి, అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం టీజీ సీడ్స్ సంస్థను ఏర్పాటు చేసింది. జిల్లాలోని పలు మండలాల్లో రైతులకు విక్రయించింది. ఆయా కేంద్రాల్లో వివిధ రకాల విత్తనాలను అందు బాటులో ఉంచింది. జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసింది.

● కల్తీ కనిపెట్టకుంటే అంతే..

ధర తక్కువగా ఉండే పురుగు మందులు, రసాయన ఎరువులను ఎక్కువ ధర ఉండే కంపెనీల పేరుతో వ్యాపారులు విక్రయిస్తున్నారు. చలామణిలో ఉన్న ఎరువులు, పురుగు మందులను పోలి ఉండేలా నకిలీలను విక్రయిస్తూ ఉంటారు. తేమఉన్న గడ్డ కట్టిన వాటిలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తాయి. గుళికలన్నీ ఒకే రంగులో ఉంటాయి. అన్యపదార్థం ఎరువులో కనిపిస్తే దాన్ని కల్తీగా గుర్తించాలి. యూరియా, కాలుష్యం, అమ్మోనియం, నైట్రేట్ ఇతర సంకీర్ణ ఎరువులు సాధారణంగా గుళికల రూపంలో ఉంటాయి. 15-15-15, 20-20-20రేణువుల రూపంలో మ్యూరేట్ ఆఫ్ పొటాషియం, సల్ఫేట్ ఎరువులు పొడిరూపంలో ఉంటాయి. అలా లేకపోతే వాటిని కల్తీగా గుర్తించాలి. యూరియా, అ మ్మోనియం, సల్ఫేట్, జింకు సల్ఫేట్ స్వచ్ఛమైనదా లేదా తెలుసు కోవాలంటే ఎరువును ఒక చెంచా తీసుకొని 5మిల్లీ లీటర్ల శుభ్రమైన నీటి (డిస్టిల్డ్ వాటర్)లో కలిపితే స్వచ్ఛందంగా ఉండాలి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్, అమ్మోనియం క్లోరైడ్ అయితే టీస్పూన్ ఎరువును 10మిల్లీలీటర్ల నీటిలో వేసి బాగా కలిపితే ఆ నీరు స్వచ్ఛంగా ఉండాలి.

● అప్రమత్తత అవసరం..

అధికారులు సూచించిన పురుగుల మందులనే వాడాలి. లేబుల్ లేని మందు సీసాలు, డబ్బాలు, ప్యాకెట్లను కొనుగోలు చేయరాదు. మందు పేరు, రూపం, శాతం పరిమాణం జాగ్రత్తలు, విరుగుడు తయారు చేసిన సంస్థ గడువు తేదీ, రిజిస్ట్రేషన్ వివరాలను కొనుగోలు చేసే ముందు పరిశీలించాలి. కొనుగోలు చేసిన డీలర్‌నుంచి సంతకం తీసుకోవాలి. మందు సీసాలు, డబ్బాలపై సీల్ సక్రమంగా లేకుంటే కొనుగోలు చేయకూడదు. లైసెన్సు లేని డీలర్లు సస్యరక్షణ మందులు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. కొనుగోలు చేసిన ఎరువులకు తగిన బిల్లు తీసుకోవాలి. దానిని జాగ్రత్తగా భద్రపరచాలి. డీలర్ పుస్తకంలో విధిగా రైతులు సంతకం చేయాలి. మిషన్ కుట్టు ఉన్న ఉన్న సంచులనే కొనుగోలు చేయాలి. చేతి కుట్టు ఉంటే దానిపై సీల్ ఉందో లేదో గమనించాలి. బస్తాపై ఉత్పత్తిదారు వివరాలు ఉన్నది లేనిది గమనించాలి. కొత్తరకం విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆ విత్తనాలను ఇంతకుముందు తోటి రైతులు ఎవరైనా కొనుగోలు చేసి ఉపయోగించారా, చీడపీడల్ని తట్టుకునే సామర్థ్యం ఎంత వరకు ఉందనే విషయాలు తెలుసుకోవడం మంచిది. గతంలో దిగుబడులు ఎలా వచ్చాయనే విషయాన్ని కూడా తెలుసుకోవాలి.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి..

- రాజులనాయుడు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు



పంటల సాగుకోసం విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆథరైజ్ డీలర్లవద్దే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదులు పొందాలి. నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కల్తీవిత్తనాలు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. పంటలసాగుపై రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

వర్షాలు కురవాలని..

గ్రామదేవతలకు జలాభిషేకం



గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, జూన్ 15: మండలంలోని ఆడెపల్లి గ్రామస్తులు వర్షాలు కురవాలని గ్రామదేవతలకు శనివారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయాల్లో ఉన్న దేవతలకు ప్రత్యేకమొక్కులు చెల్లించి వర్షాలు కురవాలని ప్రార్థించారు. వానాకాలం మొదలైనప్పటి నుంచి వర్షాలు మొదట్లో ఒకసారిపడి ఇప్పటికి మళ్లీ జాడలేకపోవడంతో రైతులు తీవ్రఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగుచేసిన రైతులు వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.

బాధితులకు పరిహారంపై సమన్వయంతో పనిచేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 15: వివిధ కేసులకు సంబంధించి బాధితులకు అందజేసే పరిహారంపై పోలీసుఅధికారులతోపాటు జిల్లా మహిళాసంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు లీగల్‌సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ సీనియర్‌సివిల్‌జడ్జి యువరాజ అన్నారు. బాధితులకు వివిధ కేసులకు సంబంధించి అందజేసే నష్టపరిహారంపై పోలీసు అధికారులు, జిల్లా సంక్షేమశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులలో బాధితులకు త్వరగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని సూచించారు. మహిళలకు నష్టపరహారం ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సంక్షేమశాఖ అధికారులతో, పోలీసులు సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ కార్యాలయంలో కూడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, సీఐ సాదిక్‌పాషా, ఎస్సైలు రాజేశ్వర్, సందీప్, సానియా, శంకరయ్య, చంద్రశేఖర్, విజయ్, ఏజీపీ దీపక్‌రావు, న్యాయవాదులు రవీందర్, శ్రీనివాస్,పీఆర్ కార్యాలయసీనియర్ అసిస్టెంట్ కరుణాకర్,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 15: బడిబాటలో భాగంగా మండలంలోని జన్కాపూర్, సాలెగూడ ప్రభుత్వపాఠశాలల్లో శనివారం జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఎంఎన్‌వో ఉదయ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు, నాయకులు సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కార్మికుల కోసం పోరాడేది హెచ్‌ఎంఎస్ మాత్రమే

మందమర్రిటౌన్, జూన్ 15: కార్మికులసమస్యల పరిష్కారం, హక్కులకోసం పోరాడేది హెచ్‌ఎంఎస్ యూనియన్ మాత్రమేనని యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకోసం పోరాడుతున్న తమ నాయకుడు రియాజ్‌అహ్మద్‌పై అక్రమకేసులుపెట్టారని, వాటిన్యాయస్థానం కొట్టివేసిందన్నారు. హెచ్‌ఎంఎస్ పోరాటాలు చేస్తున్నందునే మిగితాసంఘాలు తమ యూనియన్‌పై లేనిపోని ఆరోపణలుచేస్తున్నాయన్నారు. సింగరేణిలో అవినీతికి వ్యతిరేకంగా కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం హెచ్‌ఎంఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెల్డి సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, సంతోష్‌లు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ఎరువులు, విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 15: అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ మెయిన్ రోడ్డుపై గల విత్తనాలు, ఎరువులు, పురుగుల మందు దుకాణాన్ని అదనపుకలెక్టర్ దీపక్ తివారితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీ నిర్ణయించిన ధరలకే విత్తనాలను, ఎరువులను విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు రశీదును ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాల విక్రయాల వల్ల రైతులు నష్టపోయినట్లయితే డీలర్లు, సంబంధిత కంపెనీ యజమానులపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరిం చారు. రైతులు విత్తనాల ఖాళీసంచులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. ఒకవేళ రైతు నష్టపోయినట్లయితే ఆయాకంపెనీల నుంచి నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అక్కడే విత్తనాలు కొనుగోలు చేసిన రైతును కలెక్టర్ పలకరించగా డీలర్ విత్తనానలు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడని తెలిపాడు. దీనితో కలెక్టర్ స్పందిస్తూ రశీదులో ఉన్న రైతుల సెల్‌ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ఎవరెవరికి ఎంత ఎక్కువ ధరలకు విక్రయించారో, వారి వివరాలను వెంటనే తెలుసుకోవాలని జిల్లా వ్యవవసాయాధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖ, వ్యవసాయ, పోలీసుటాస్క్‌ఫోర్స్ అధికారులు సమన్వయం చేసుకుని జిల్లాలో నకిలీ విత్తనాల రవాణా, విక్రయాలు అరికట్టాలని తెలిపారు. ఆయనవెంట జిల్లా వ్యవసా యాధికారి శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు మిలింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని తుంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఏకరూపదుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నభోజన వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బడిమానేసిన విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. వర్షాలు కురినప్పుడు పాఠశాల భవనంపై కప్పు ఊరుస్తుందని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు తెలపంతో కలెక్టర్ వెంటనే స్పందించి డాంబర్‌షీట్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీరాజ్ ఇంజనీర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ ఇంటింటిసర్వే త్వరగా పూర్తిచేయాలి

ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు మిషన్‌భగీరథ సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శనివారం ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ గ్రామంలో అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఇంటికి మిషన్‌భగీరథనీరు అందించేందుకు సర్వేచేపడుతున్నామని సర్వేసిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తప్పులు దొర్లకుండా త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం వస్తున్నందున డ్రైనేజీలను శుభ్రం చేయాలని, నీరునిలువ ఉండకుండా చూడాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు. దోమలవల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడాలని తెలిపారు. అలాగే వర్షాకాలంలో నీరుఎక్కువగా కలుషితమయ్యే అవకాశం ఉన్నందున కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. ఆయనవెంట డీపీవో ఒమర్‌హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, మిషన్‌భగీరథ ఇంజనీర్ శైలేందర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



తుంపల్లి ఎంపీపీఎస్ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 15: ప్రముఖ కంపెనీలలో పనిచేయుట కోసం జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల19న ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో టాస్క్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సహకారంతో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకులో రిలేషన్షిప్ మేనేజర్ పోస్టులు50, యెస్ బ్యాంకులో రలేషన్షిప్ మేనేజర్‌లు 50కలవని తెలిపారు. ఏదైనాడిగ్రీ, 28 సంవత్సరాలలోపు వయస్సు గల అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు. జీతం రూ.18నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 19న జాబ్ మేళాకు విద్యార్హత సర్టిఫికేట్లతో హాజరు కావాలన్నారు. మిగితా వివరాలకు 9908187894ను సంప్ర దించాలన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



ఎంపీ గోడం నగేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానేపల్లి, జూన్ 15: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం చింతలమానేపల్లి మండలానికి చెందిన బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా పలు సమస్య లను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, రాజేందర్‌గౌడ్, సురేష్ తదితరులు ఉన్నారు.



కార్మిక హక్కులు, సంస్థ పరిరక్షణ ఏఐటీయూసీతోనే సాధ్యం

మందమర్రిటౌన్, జూన్ 15: సింగరేణిలో కార్మిక హక్కులు, సింగరేణి సంస్థ పరిరక్షణ తమయూనియన్‌తోనే సాధ్యమని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాదుని సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం ఏరియాలోని కేకే5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడుతూ తాము గెలిచి 6నెలలు కావస్తున్నా ఇంకా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. సింగరేణిలో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని, భూగర్భ గనులు మూతపడుతున్నాయన్నారు. గుర్తింపుపత్రం ఇవ్వకుంటే పోరాటాలు చేస్తామని పేర్కొ న్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, సోంశెట్టి రాజేశం, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, నాయకులు పాల్గొన్నారు.

పని స్థలాల పరిశీలన

మందమర్రిటౌన్, జూన్ 15: ఏరియాలోని కేకే5 గనిలోకి శనివారం ఏఐటీయూసీ ఏరియా నాయకులు దిగారు. గనిలోపల పనిస్థలాలను పరిశీలించారు. కార్మికులను తాగునీరు, గాలి తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. దాదాపు 3గంటల పాటు గనిలోనే ఉండి సమస్యలపై ఆరా తీశారు. గనిపైకి వచ్చిన అనంతరం నాయకులు మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన పనిముట్లు, పాదరక్షలు, హెల్మెట్‌లు అందించాలని, లోపల తాగునీటిసౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సలేంద్ర సత్యనారాయణ, రాజేశం, శ్రీనివాస్, సంపత్, విక్రమ్‌సింగ్, సంతు పాల్గొన్నారు.

విశ్రాంత కార్మికులకు న్యాయం చేయండి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ కార్మికులు

శ్రీరాంపూర్, జూన్ 15: సింగరేణి విశ్రాంతకార్మికులకు న్యాయంచేయాలని కోల్‌పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం బాబురావు, సింగరేణి రిటైర్డ్‌ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధానకార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్ బలరాంను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి విశ్రాంత కార్మికులు అతి తక్కువ పెన్షన్‌తో జీవిస్తున్నారన్నారు. ఓఎన్‌జిసి రిటైర్డ్‌కార్మికులకు కేంద్రప్రభుత్వం 70ఏళ్ల వయస్సున్నవారికి ప్రతి ఐదేళ్లకోమారు యాభైవేల రూపాయల నుంచి లక్ష వరకు ఆర్థిక ప్యాకేజీ ఇస్తున్నారని అన్నారు. వారిమాదిరిగా సింగరేణి రిటైర్డ్‌కార్మికులకు ఆర్థికప్యాకేజీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సింగరేణి రిటైర్డ్ కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలన్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు

శ్రీరాంపూర్, జూన్ 15: అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా మెడికల్‌బోర్డు నిర్వహిస్తామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం సాయంత్రం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అనారోగ్యకారణాలతో విధులు నిర్వర్తించలేకపోతున్న కార్మికుల కోసం ప్రతినెలా మెడికల్ బోర్డును నిర్వహిస్తున్నామన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలున్న కార్మికులను అన్‌ఫిట్ చేస్తామని, ఈ విషయంలో ఇతరుల ప్రమేయం ఉండబోదన్నారు. గతంలో జరిగిన మెడికల్‌బోర్డు అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ), నేర దర్యాప్తు సంస్థ(సీఐడీ) ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపి కఠిన చర్యలు తీసుకుంటామని, జైలుకు పంపిస్తామని సీఎండీ హెచ్చరించారు.

రియాజ్ అహ్మద్‌పై పెట్టిన కేసుల కొట్టివేత: హెచ్‌ఎంఎస్

రామకృష్ణాపూర్, జూన్ 15: సింగరేణి కార్మికులపక్షాన న్యాయమైన హక్కుల కోసం పోరాడే రియాజ్ అహ్మద్‌పై దాడిచేస్తూ అన్యాయంగా అర్ధరాత్రి ఆఫీస్‌ను కూల్చి, అట్రాసిటీకేసులు పెట్టించినకేసులన్నీ బూటకమని న్యాయస్థానం ఆ కేసులను కొట్టివేసిందని హెచ్‌ఎంఎస్ నాయకులు పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు న్యాయం వెంటే ఉంటారని మందమర్రి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జే శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వెల్డి సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

శ్రీరాంపూర్, జూన్ 15: శ్రీరాంపూర్ వృత్తిశిక్షణ కేంద్రంలో హెడ్‌ఓవర్‌మెన్‌గా పనిచేస్తూ 53సార్లు రక్తదానంచేసిన దేవతల రాజ్‌కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఈనెల14న ఆయనను సన్మానించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు శ్రీనివాస్,ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

నస్పూర్, జూన్ 15: నస్పూర్ కాలనీలో జెన్ షీతో ర్యూ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆయా గ్రేడింగ్‌లో ప్రతిభను చూపిన విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. మాస్టర్ పోచంపల్లి వెంకటేష్, సీనియర్ మాస్టర్ రంగ రమేష్, మదర్ ప్రైడ్ స్కూల్ డైరెక్టర్ రేగళ్ళ ఉపేందర్, గ్రీన్‌కిడ్స్‌ప్లే స్కూల్ డైరెక్టర్ పెంచాల వేణు, కేజీప డిఫెన్స్‌అకాడమీ డైరెక్టర్‌కుమార్, ఇన్స్‌పెక్టర్ రమేష్, సృష్టిస్కూల్‌ప్రిన్సిపల్‌అంబాలరాజ్‌కుమార్‌విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం

భీమారం, జూన్ 15 : ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను శనివారం హైద్రాబాద్‌లో బీసీ స్టేట్‌యూత్ వర్కింగ్‌ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.మల్లన్నను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 15: హకీంపేట ప్రాంతీయ క్రీడా పాఠశాల, కరీంనగర్, ఆదిలాబాద్ పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన క్రీడాఅధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మూడోతరగతి పాసై నాల్గవ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపిక విధానం మూడుస్థాయిల్లో జరుగుతుందని పేర్కొన్నారు. మొదటమండల స్థాయిలో ఏడుఅంశాలలో పోటీలను నిర్వహిస్తారన్నారు. ఇందులోఅర్హత సాధించిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 01.09.2015నుంచి 31.08.2016మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. అర్హత, ఆసక్తిగల విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి తెలిపారు.

చాకెపల్లిలో కిడ్నాప్ కలకలం

మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూరు, జూన్ 15: చాకెపల్లిలో శనివారం కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. వేకువజామునే గ్రామంలోకి ప్రవేశించిన ఓ యువకుడు ఓ చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు యత్నించగా విషయం తెలుసుకున్న గ్రామస్థులు యువకుడిని బంధించి చితకబాదారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కిడ్నాపర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో సీఐ రవీందర్ మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన గోపినాయక్ కూలీ కోసం ఈ ప్రాంతానికి వచ్చాడని తెలిపారు. కొంత కాలంగా మతి స్థిమి తం కోల్పోయి తిరుగుతున్నట్లు వివరించారు. శనివారం ఉదయం చాకెపల్లి గ్రామానికి వెళ్లగా పిల్లలు అతడిపై రాళ్ళు విసరడంతో పిల్లలను బెది రించాడన్నారు. గోపినాయక్ హిందీ మాట్లాడడం, అనుమానాస్పదంగా ఉండడంతో కిడ్నాపర్‌గా పేర్కొంటూ బంధించారన్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన వారిని విచారించగా మతి స్థిమితం కోల్పోయి కూలీ పనులు చేసుకుంటున్నట్లు వెల్లడించినట్లు సీఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

జైపూర్, జూన్ 15 : ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి తలకు గాయాలైనట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. వ్యక్తిని చికిత్స నిమిత్తం మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే శ్రీరాంపూర్ సీఐ 8712656549, ఎస్ఐ 8712656551 సమాచారం అందించాలని తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


మంద రాజేష్ (ఫైల్)

బెల్లంపల్లి, జూన్ 15: పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన మంద రాజేష్ (34) కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజేష్ ఐదు రోజుల క్రితం జమ్మికుంటలోని అంబాలపూర్‌లో అత్తగారింట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. బుధవారం కుటుంబ సభ్యులతో గొడవ జరగడంతో ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్సకు శరీరం సహకరించడం లేదని ఇంటికి వెళ్లాలని సూచించారు. శనివారం బెల్లంపల్లికి తీసుకువచ్చిన కొంత సేప టికి రాజేష్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


రమేష్‌గౌడ్(ఫైల్)

జైపూర్, జూన్ 15: తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలైన కిష్టాపూర్ గ్రామానికి చెందిన బొంగోని రమేష్‌గౌడ్ (55) శనివారం మృతి చెందాడు. ఈ నెల 9న తాటికల్లు తీసేందుకు చెట్టు ఎక్కుతుండగా కిందపడడంతో గాయాలయ్యాయి. మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

తాండూర్, జూన్ 15: తాండూర్ వాల్మీకినగర్‌కు చెందిన జంశెట్టి గట్టు మల్లయ్య అనే రైతుకు చెందిన ఎద్దు శనివారం పిడుగు పాటుకు మృతి చెందింది. బాధితుడు మాట్లాడుతూ 15 రోజుల క్రితం రూ.70 వేలతో ఎద్దుల జతను కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్‌లు పరిశీలించారు.

జిల్లాలో చెరువుల రక్షణకు ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 15: జిల్లాలో చెరువుల రక్షణ, పునరుద్దరణ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో చెరువుల రక్షణ, పునరుద్దరణకు తీసుకున్న చర్యలు, ఎదుర్కొన్న సవాళ్ళు, పరిష్కారాలపై అధ్యయనం చేసి రాష్ట్రంలో చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ రూపొందించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను గుర్తించి హద్దురాళ్ల ఏర్పాటు, బఫర్ జోన్, చెరువులో నీటి సరఫరా జరిగే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. చెరువుల్లో కలుషిత నీరు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవా లన్నారు. జూలై 5 లోగా సూక్ష్మ కార్యచరణ ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే


మల్లు భట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, జూన్ 15: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను శనివారం హైద్రాబాద్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజల కోసం పోరాడే వ్యక్తి భట్టి విక్రమార్క అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

నస్పూర్, జూన్ 15 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా భట్టి సోషల్ మీడియా ఆధ్వర్యంలో శనివారం సీసీసీలోని శ్రీసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. భట్టి విక్రమార్క సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ మాసు వెంకటేష్, నాయకులు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కస్తూర్బా పాఠశాలలో క్వాలిటీ కోఆర్డినేటర్

భీమిని, జూన్ 15: విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన భోజనం అందించాలని క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగు నీరు, తదితర వసతులు కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న రూ.8.40 లక్షల అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతతో చేపట్టాలని ఆయన ఆదేశిం చారు. ప్రత్యేకాధికారి కవిత, ఏపీఎం పంజాల ప్రకా ష్ గౌడ్, ఐకేపీ వీఓ అధ్యక్షురాలు విమల తదిత రులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకోవాలి

ఏసీసీ, జూన్ 15 : బక్రీద్ పండగను ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ అన్నారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ మతాల పెద్దలతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం సోదరులందరు కుల మతాలకు అతీతంగా బక్రీద్ పండగను జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వవద్దన్నారు. మంచికి మారుపేరుగా ఉన్న మంచిర్యాలకు చెడ్డ పేరు తీసుకురావద్దన్నారు. హిందూ ముస్లింలు సోదర భావంతో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్, పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


గూడెం అయ్యప్పస్వామి మందిరంలో హోమం

దండేపల్లి, జూన్15: గూడెం అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. గోపూజ, వేదస్వస్తి, గణపతి పూజ, పంచామృత అభిషేకం, అష్టోత్తర శతకల, పూర్ణాహుతి, పుష్పాభిషేక పూజలను ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ, అయ్యప్పదీక్ష సేవ సమితి సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

మందమర్రిటౌన్, జూన్ 15 : యువత సన్మార్గంలో నడవాలని, దేశ ప్రగతే ధ్యేయంగా పాటు పడాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఊరు మందమర్రిలో నిర్వహించిన పోలీసు మీకోసం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్‌లు, క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు

భీమారం, జూన్ 15 : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిపై భీమారం సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగుర రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు శనివారం తెలిపారు. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు సడంశెట్టి రమేష్, తైనేని రవిలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి లహరి

హాజీపూర్, జూన్ 15 : 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి లహరి తెలిపారు. నులి పురుగుల నివారణ దినోత్సవం ఈ నెల 20న పురస్కరించుకొని మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. శనివారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేయాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, హెచ్‌ఈవో రఘుపతి, హెచ్ఎస్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

జైపూర్: సీజనల్ వ్యాధుల పట్ల మహిళా సంఘాల సభ్యులు అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముస్తాఫా పేర్కొన్నారు. మండల సమాఖ్య భవనం లో మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు 1 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరు వేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మాత్ర లను ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిల్లలందరికి వేయాలన్నారు. నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలే కీలక మన్నారు. ఎంపీడీవో సత్యనారాయణ, కుందారం మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, ఏపీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన డీసీపీ

బెల్లంపల్లి, జూన్ 15 : బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పూదరి సమ్మయ్యను శనివారం మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ అభినందించారు. డీసీపీ మాట్లాడుతూ గత నెల 22 నుంచి 24 వరకు హైద్రాబాద్‌లోని గచ్చిబౌళి స్టేడియంలో పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో 50 సంవత్సరాల విభాగంలో షాట్‌పుట్ త్రోలో సమ్మయ్య ద్వితీయ స్థానం సాధించాడన్నారు. విధులు నిర్వహిస్తూ క్రీడల్లో రాణించడం ఆనందంగా ఉందన్నారు.

విత్తనాలు విత్తేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి


రైతులకు సూచనలు ఇస్తున్న ఏఈవో మారుతి

బెజ్జూరు, జూన్ 15: రైతులు విత్తనాలు విత్తేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఏఈవో మారుతి అన్నారు. శనివారం మండలంలోని కాటేపల్లి శివారులో రైతుల పంటచేనులను సందర్శించి వారికి విత్తనాలు విత్తడంలో సూచనలు, జాగ్రత్తలను వివరించారు.

మానవ మృగాన్ని ఉరితీయాలని కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు

కాగజ్‌నగర్, జూన్ 15: దహెగాంకు చెందిన చిన్నారిని పెద్దపల్లిలో అత్యాచారం, హత్యచేసిన మానవ మృగానికి వెంటనే ఉరిశిక్ష వేయాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ ఈ సంఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, కార్యకర్తలు, వివిధసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలో వివిధ పార్టీలు, కులసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభం శుభం తెలియని చిన్నారిని అతి కిరాతకంగా హత్య చేసినవారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

కఠినంగా శిక్షించాలి..

ఆఫాబాద్/సిర్పూర్(టి): పెద్దపల్లిజిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో దహెగాం మండలానికి చెందిన చిన్నారిని అత్యాచారంచేసి హత్యచేసిన మానవ మృగాన్ని కఠినంగాశిక్షించాలని ఆరెసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారంఆసిఫాబాద్ ఎస్‌హెచ్ వోకు, సిర్పూర్(టి)పోలీసులకు నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆసంఘంనాయకులు జైరాం, బిక్కాజీ,అన్నారావ్ తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్(టి)లో నాయకులు శంకర్, నానాజీ, మధుకర్, శంకర్, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతి వరకు కొనసాగించాలి

సిర్పూర్(యు), జూన్ 15: మండలంలోని బండేయేర్ గ్రామంలో శనివారంగ్రామస్థులు,పాఠశాలకమిటీ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామంలోగల గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాలలో ఈ ఎడాది 1నుంచి 5వతరగతి వరకు బోధించాలని తీర్మానించారు. తీర్మాణం కాపీని మహగాం ఎస్సీఆర్పీ మారుతికి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విలాస్, వీటీడీఏ చైర్మన్ కుమ్ర భీంరావు, గ్రామస్థులుపాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు ముస్తాబవుతున్న ఈద్గాలు

సిర్పూర్(టి), జూన్ 15: ఈనెల17న బక్రీద్ పండుగను పురస్కరించుకుని మండలకేంద్రంలోని ఈద్గాలను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముస్తాబు చేస్తున్నారు. ప్రత్యేక ప్రార్థనల కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈద్గా పరిసరాల్లో పిచ్చి మొక్కలను, చెత్తచెదారాన్ని తొలగిస్తున్నట్లు ఎంపీవో కృష్ణమూర్తి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న న్యూరాజంపేట కాలనీ వాసులు

ఆసిఫాబాద్, జూన్ 15: ఆసిఫాబాద్ పట్టణంలోని న్యూరాజంపేట కాలనీకి చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పేద ప్రజల కోసంప్రభుత్వం గతంలో ప్లాట్లు కేటాయించగా కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. కాలనీకి వెనకభాగంలో రోడ్డుకు స్థలం కేటాయించినప్పటికీ రోడ్డుకు స్థలం వదలకుండా పక్క భూమి ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని విన్నవించారు. ఈ విషయమ్మై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పోచయ్య, మల్లయ్య, అరుణ్, మంగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 15: ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఐక్యవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శంకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇష్టారాజ్యంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు శ్రీనివాస్, గోపాల్, క్రాంతికుమార్, వంశీ, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

దహెగాం, జూన్ 15: మండలంలోని గొర్రెగుట్ట గ్రామానికి చెందిన నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే షబ్బీర్, ఎస్ రఫీక్, ఎస్‌కె రైయిస్, ఎస్‌కె నజీరబీ అనే నలుగురు వ్యక్తులు ఎస్‌కె వజీర్ ఇంటి పెరటి భూమి విషయంలో గొడవకు దిగినట్లు పేర్కొన్నారు. మాటా మాట పెరిగి కొట్లాటకు దారితీసిందన్నారు. ఎస్‌కె వజీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మర్సుకోల లక్ష్మణ్‌ను పరామర్శించిన నాయకులు


లక్ష్మణ్‌ను పర్మార్శిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

సిర్పూర్(యు), జూన్ 15: మండలంలోని పాములవాడ గ్రామనికి చెందిన మర్సుకోల లక్ష్మణ్‌ను శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, మండల నాయకులు పరామర్శించారు. ఇటీవల్ల జైనూర్‌లో ఎన్నికల రోజు జరిగిన సంఘటనలో ఆదివాసీ యువకుడు మర్సుకోల లక్ష్మన్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన విషయం విధితమే. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆరోగ్య బాగా లేదన్నారు. ఆయన లేవలేని స్థితిలో ఉన్నాడన్నారు. న్యాయం చేస్తామన్న అధికారులు ఇంతవరకు కొట్టిన వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. ఈ విషయంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ తరపున జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. లక్ష్మణ్‌కు ప్రభుత్వం 10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. 15 రోజులోపు న్యాయం చేయకుంటే ఆదివాసీసంఘల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదోళనలు చేపడుతామన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు


దహెగాంలో విత్తనాలు నాటుతున్న రైతులు

దహెగాం, జూన్ 15: మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గ్రామాల్లో పంట చేనులను రైతులు చదును చేస్తుండగా మరికొంత మంది రైతులు పత్తివిత్తనాలు వేస్తున్నారు. దీంతో రైతులు, కూలీలు బిజీ బిజీగా పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో పత్తి 24వేల ఎకరాల్లో, వరి 9వేల ఎకరాల్లో, ఇతర పంటలు మరో వెయ్యిఎకరాల్లో సాగుచేస్తున్నట్లు వ్యవసాధికారులు అంచనా వేశారు. ఇదిలా ఉంటే మండలంలో 70 శాతానికి పైగా రైతులు పత్తివిత్తనాలను విత్తుకున్నారు.

రూ.1.50 లక్షల దేశీదారు స్వాధీనం

● ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్, జూన్ 15: కాగజ్‌నగర్ తిలక్‌నగర్‌లో శనివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ తిలక్‌నగర్‌లో రాజు అనే వ్యక్తి దేశీదారు విక్రయిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. శనివారం తిలక్ నగర్‌లో రాజును అదుపులోకి తీసుకొని తనిఖీ చేసి అతని వద్ద ఉన్న రూ.1.50లక్షలు విలువ గల దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ వివరించారు. దాడుల్లో ఎస్సై సురేష్, సిబ్బంది శ్రీనివాస్, మల్లేష్, సతీష్ మండల్ ప్రవంతి పాల్గొన్నట్టు వివరించారు.


స్వాధీనం చేసుకున్న దేశీదారుతో ఎక్సైజ్ అధికారులు

ఒకరిపై పోక్సో, హత్యాయత్నం కేసు నమోదు

వాంకిడి, జూన్ 15: మండల కేంద్రానికి చెందిన నితిన్ పవార్‌పై పోక్సో, హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి నితిన్ పవార్ తొమ్మిదేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి తల్లి అతన్ని మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన పవార్ మహిళపై గొడ్డలితో దాడిచేశాడు. మహిళకు తలపై గాయం కావడంతో ఆమెను వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నితిన్ పవార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారి కుటుంబానికి పరిహారం ఇప్పిస్తా

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

దహెగాం, జూన్ 15: మండలానికి చెందిన చిన్నారి సుల్తానాబాద్‌లో దారుణంగా హత్యకు గురికాగా గురువారం రాత్రి బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదారుణానికి ఒడిగట్టిన కీచకుడికి ఉరి పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయిస్తామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున పరిహారం ఇప్పిస్తామని తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బెజ్జూరు, జూన్ 15: బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి సమీపంలోని భూ విషయంలో ఇరువర్గాలకు చెందిన 35మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. 167/2, 167/3, 167/4, 167/5 సర్వే నెంబర్లలో 48.30ఎకరాల భూమి ఉండగా మర్తిడికి చెందిన మహ్మద్‌ఇస్మాయిల్ వద్ద 2011లో కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జెల సురేష్‌తోపాటు ఆయన అన్నదమ్ములు 34.30ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మిగితా 14ఎకరాల భూమి మహ్మద్ ఇస్మాయిల్, భార్య నూర్‌జాన్, కొడుకు ఇసాక్‌ల వద్ద భూపాలపల్లి జిల్లాకు చెందిన మెరుగు భిక్షపతిగౌడ్ అనేవ్యక్తి 2021లో కొనుగోలు చేశాడని చెబుతుండగా అతని వద్ద భూమికి సంబంధించిన పట్టాపాసు పుస్తకాలు లేవు. కాగా గజ్జెల సురేష్ సాగు చేసుకుంటున్న భూమి తమదేనంటూ భిక్షపతిగౌడ్ దున్నడం, నూర్‌జాన్, ఇస్మాయిల్, ఇసాక్‌లు దున్నడంతో గజ్జెల సురేష్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మర్తిడి, లంబాడీగూడ, సులుగుపల్లికి చెందిన 31 మందితో పాటు గజ్జెల సురేష్ తనను కొట్టినట్టు భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్‌తో పాటు అతని ముగ్గురు సోదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


మంచిర్యాల

జిల్లా వార్తలు

5

ఆదివారం 16 జూన్ 2024





పీఎస్ హెచ్ఎంల పోస్టుల భర్తీ ఎప్పుడు?

- 10వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం హామీ
- 20 ఏళ్లుగా ఎస్జీటీల ఎదురుచూపులు
- పదోన్నతికి నోచుకోని ఉపాధ్యాయులు
- ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వేడుకోలు

మంచిర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ ఎప్పుడని ఆశావహులు వేచి చూస్తున్నారు. ప్రస్తుత పదోన్నతుల్లో అవ కాశం లేకపోయినా, గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు భర్తీ చేస్తే కొంతవరకైనా తమ సమ స్యలు తీరుతాయనే భావనలో ఎస్జీటీలు ఉన్నారు. ఆ పోస్టులను ప్రభు త్వం మంజూరు చేస్తే అప్‌గ్రేడేషన్‌లో తమకూ అవకాశం లభిస్తుందనేది వారి వాదన. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే మంచిర్యాల జిల్లాలో దాదాపు మరో 150 మంది వరకు ఎస్జీటీలకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఈ విషయంలో కొందరు ఎస్జీటీలు కోర్టులో కేసు కూడా వేశారు. ఈ అంశం ఈ నెల 14న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 10వేల పోస్టులు మంజూరు చేసి ఎస్జీటీలకు న్యాయం చేయాలని, ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

● స్థానం దక్కని ఎస్జీటీలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీలు)కు మాత్రం స్థానం కల్పించకపోవడంతో వారంతా నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తానని ప్రకటించిన 10,479 పోస్టుల్లో తెలుగు-4493, హిందీ-3883, పీఈటీ-1778 ఉన్నాయి. మిగతా కొన్ని ఇతర మైనర్ మీడియం పోస్టులు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా పరిధిలో తెలుగు-115, హిందీ-110, పీఈటీ-33 పోస్టులను గ్రేడ్-1గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. అప్‌గ్రేడేషన్ తరువాత జిల్లాలో కొద్ది మంది మాత్రమే గ్రేడ్-2 ఉపాధ్యాయులు ఉంటారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల భాషా పండితులు, పీఈటీలు ఆనందం వ్యక్తం చేస్తుండగా, ఏన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం వేచి చూస్తున్న ఎస్జీటీలు మాత్రం నిరుత్సాహానికి గురవుతున్నారు. అప్‌గ్రేడేషన్‌లో అర్హత కలిగి ఉన్నందున ఎస్జీటీలు తమకు కూడా అవకాశం కల్పించాలని పోరాటం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎస్జీటీలు ప్రభుత్వంతోపాటు యూనియన్లపై ఆగ్రహంతో ఉన్నారు.

● పేరుకుపోయిన సమస్యలు

విద్యారంగంలో దీర్ఘకాలికంగా పలు సమస్యలు పేరుకుపోయాయని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పెండింగ్ బిల్లుల పరిష్కారం, తెలంగాణలో రెండో పీఆర్సీ, పెండింగ్ డీఏల ప్రకటన, భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ, ప్రాథమిక పాఠశాలల్లో పీఎస్ హెచ్ఎం పోస్టుల భర్తీ వంటి అనేక సమస్యలకు పరిష్కారం చూపకపోవడంతో విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు తర్వాత విద్యారంగం పట్ల దృష్టిసారించడంతో ఉపాధ్యాయ లోకానికి ఊరట లభించినట్లయింది. ప్రస్తుత ప్రభుత్వం భాషా పండితులు, పీఈటీల ఉన్నతీకరణ చేపట్ట డంతో అనేక సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆయా విభాగాలకు చెందిన ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10,479 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రక టించి, ఆ దిశగా చర్యలు కూడా చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భాషా పండితులు, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తయింది.

పీఎస్ హెచ్ఎం పోస్టులు భర్తీ చేయాలి

- బండి రమేశ్, తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వెంటనే 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలి. ఈ పోస్టులను అర్హతగల ఎస్జీటీలకు కేటాయించాలి. తద్వారా ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీంకోర్టులో కేసు వేయడం ద్వారా న్యాయ వివాదాలను పరిష్కరించాలి.

నల్ల బ్యాడ్జీలు ధరించి ఎస్జీటీల నిరసన

నెన్నెల, జూన్ 15: ఎస్ఏ తెలుగు టీచర్ల ప్రమోషన్లలో ఎస్జీటీలకు అన్యాయం జరిగిందని నార్వాయిపేటలో శనివారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ జలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎస్జీటీలు నష్టపోతున్నారన్నారు. పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ భాషా పండితులకు మాత్రమే అవకాశం కల్పించడంతో అన్ని అర్హతలు ఉండి 20 ఏళ్ల సర్వీసులో ఉన్నవారికి సైతం నష్టం జరుగుతుందన్నారు. పదోన్నతుల్లో సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ఎస్ఏ తెలుగు ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.



నార్వాయిపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్జీటీలు

యువత ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి



మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

చెన్నూరు(కోటపల్లి) జూన్ 15: యువత ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ పోలీసులు ఉన్నది మీ కోసమేనని, ప్రజల భద్రతే పోలీసుల ధ్యేయమని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలు పోలీసు శాఖ తరుపున నిర్వహిస్తామన్నారు. యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలతో దేహదారుఢ్యం పెరుగుతుందని, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల నిర్వహణకు పోలీసు శాఖ తరుపున సహకరిస్తామన్నారు. యువకులు గంజాయి, మద్యం, జూదం, ఇతర మత్తు పదార్థాలకు లోను కావద్దన్నారు. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, కొత్త వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం కోటపల్లి, నీల్వాయి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల యువకులకు వాలీబాల్, క్రికెట్ కిట్లు, జెర్సీలు అందజేశారు. మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కోటపల్లి, నీల్వాయి ఎస్ఐలు రాజేందర్, శ్యామ్ పటేల్,యువకులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ

తాండూర్, జూన్ 15: క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. శనివారం తాండూర్ సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ప్రారం భించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. క్రీడల్లో రాణించేందుకు పోలీసు శాఖ సహకరిస్తుం దన్నారు. సీఐ కుమారస్వామి, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎస్ఐలు కిరణ్‌కు మార్, విజయ్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌గా కుమార్‌దీపక్



మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 15: మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా కుమార్ దీపక్‌ను నియమిస్తూ ప్రభుత్వం శని వారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న బదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్నారు. కుమార్ దీపక్ గతంలో ఇక్కడ ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుష్మరావు

జన్నారం, జూన్ 15: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుష్మరావు అన్నారు. శనివారం జన్నారంలో విలేకరుల సమావేశంలో ఎఫ్ ఆర్వో మాట్లాడుతూ అధికారులే కాకుండా ప్రజలందరు అడవుల సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. చెట్లను కాపాడడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఎవరు కూడా చెట్లను నరకవద్దని సూచించారు. కవ్వాల టైగర్ జోన్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, గడ్డి క్షేత్రాలు పెం చామని, సోలార్ సాసర్ పిట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టు మధ్యప్రదేశ్, కేరళలో ఉన్న రిజర్వ్ ఫారెస్టుల మాదిరిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎవరైనా అక్రమంగా కలప రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి స్మగ్లర్లపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది శేషరావు, గోపికృష్ణ, శ్రీనివాస్, రహీమొద్దీన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీలో రాష్ట్రస్థాయి అవార్డు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 15: గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు లింకేజీలో లక్ష్యానికి మించి రుణాలు ఇవ్వడంతో రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం లభించిందని డీఆర్‌డీవో కిషన్ శనివారం తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గతేడాది 5,977 సంఘాలకు రూ.358.58 కోట్ల బ్యాంకు లింకేజీ లక్ష్యంగా నిర్ధేశించగా 6,606 సంఘాలకు రూ.420.18 కోట్లను 59,454 మంది సభ్యులకు అందజేశామన్నారు. గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి వెంకటేశ్వర్లు, డీపీఎం స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి అనితలు పాల్గొన్నట్లు తెలిపారు.

ఐఐటీలో సీటు సాధించిన గిరిజన విద్యార్థిని



నైతం శ్రావణి

నెన్నెల, జూన్ 15: మండలంలోని మారుమూల గ్రామం కోనంపేటకు చెందిన గిరిజన విద్యార్థి నైతం శ్రావణి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ కనబరిచి ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించింది. శ్రావణికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సీటు లభించగా శనివారం అలాట్‌మెంట్ లెటర్ అందింది. భీమారం ఆశ్రమ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న నైతం అర్జయ్యసుజాతల కూతురు శ్రావణి మంచిర్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. బాసర ట్రిబుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేసింది. ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఎస్టీ క్యాటగిరీలో ఆల్ ఇండియా ర్యాంక్ 263 సాధించింది. దీంతో ఆమెకు ఐఐటీలో సీటు దక్కింది.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

మందమర్రిరూరల్, జూన్ 15: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం అందుగులపేటలో చేపడుతున్న పైపులైన్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నర్సరీలను పరిశీలించి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, నాయకులు కడారి జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడి చర్చ - హాజరైన ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్, పాల్గొన్న ఎమ్మెల్యేలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 15: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు అధ్యక్షతన జరిగింది. పలు సమస్యలపై జడ్పీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. కన్నెపల్లి జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో గొర్రెల కోసం లబ్ధిదారులు డీడీలు కట్టి ఏండ్లు గడుస్తున్నా పంపిణీ చేయలేదని, వెంటనే గొర్రెలను అందజేయాన్నారు. కేజీబీవీ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

లక్షెట్టిపేట జడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ పదవీ కాలం ముగుస్తున్నా అధికారులు కార్యక్రమాలను తమకు తెలియకుండా చేస్తున్నారన్నారు. పించన్లను సకాలంలో అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు, నగదు చెల్లింపులో జాప్యం జరుగుతుందని, సీఎంఆర్ అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పత్తి విత్తనాలు రూ.800లకు అమ్మాల్సి ఉండగా బ్లాకులో రూ.1500లకు అమ్ముతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. వేమనపల్లి, హాజీపూర్ జెడ్పీటీసీలు స్వర్ణలత, శిల్పాలు మాట్లాడుతూ పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్, జడ్పీ సీఈవో గణపతి, సూపరింటెండెంట్ బాలకిషన్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి : ఎమ్మెల్యే పీఎస్సార్

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలి. మిల్లర్లు ధాన్యాన్ని సమయానుకూలంగా నిర్వహించాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులు పనిచేయాలి.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి : ఎమ్మెల్యే వినోద్

అధికారులు విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. అధికా రులు, ప్రజాప్రతినిధులు జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగంలో నిలపాలి.

ఆదివాసీలపై దాడులను సహించేది లేదు : ఎమ్మెల్యే బొజ్జు

పోడు చేసుకుంటున్న ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తూ దాడులు చేస్తే సహించేది లేదు. 40 ఏండ్ల పాటు పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసీలకు పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తాం. వారిని మోసగించి వేరే వారికి భూములు ఇస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఆదివాసీలపై దాడులు చేయాల్సిన అవసరం ఏం ఉంది. ఫారెస్టు అధికారులు ఆదివాసీలను ఏమి అనవద్దు.

జిల్లా అభివృద్ధికి కృషి చేసిన వారికి అభినందనలు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు అభినందనలు తెలిపారు. శనివారం చివరి సమావేశం కావడంతో జెడ్పీటీసీలను సన్మానించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పాలు పంచుకున్న ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. వైస్‌చైర్మన్ తొంగల సత్యనారాయణ, జెడ్పీటీసీలు చంద్రశేఖర్, స్వర్ణలత, సత్తయ్య, సత్యనారాయణ, నాగ రాణి, చంద్రయ్య, శిల్ప, గంగక్క, సునీత, తిరుపతి, రవి, బానయ్య, శ్యామల, పాల్గొన్నారు.



జడ్పీటీసీలను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్షెట్టిపేట రూరల్, జూన్ 15: మార్కెట్ కమిటీ పాలకవర్గ బాధ్యతలు చేపట్టిన ప్రతీ ఒక్కరు రైతుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కోరారు. లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శనివారం పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతు కూడా బాధపడ కుండా చూడాల్సిన బాధ్యత పాలకవర్గం తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి అవసరాలు ఉన్న తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం కొనుగోలు కేం ద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసు కున్నామన్నారు. నియోజకవర్గంలో గిడ్డంగుల ఏర్పాటుకు దృష్టి సారించామని, ఎక్కడెక్కడ అవసరముందో తెలపాలని కోరారు. అనంతరం అధికారుల సమక్షంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా దాసరి ప్రేంచంద్, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఆరీఫ్‌లతోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీపీలు అన్నం మంగ గడ్డం శ్రీనివాస్ జడ్పీటీసీ సభ్యులు గడ్డం నాగారాణిత్రిమూర్తి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి కౌన్సిలర్లు చెల్ల నాగభూషణం, సురేష్‌నాయక్, జిల్లా మార్కెట్ కమిటీ అధికారి గజానంద్, సెక్రెటరి శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరి రాజేశ్వర్, నాయకులు చింత అశోక్ పింగిళి రమేష్, బియ్యాల తిరుపతి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం

దండేపల్లి: లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ పాలక వర్గం చైర్మన్, డైరెక్టర్లలను మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు. చైర్మన్‌గా ధర్మారావుపేట చెందిన దాసరి ప్రేమ్‌చంద్, డైరెక్టర్లుగా దండేపల్లి చెందిన కట్కారి రాజన్న, తాళ్ళపేట చెందిన కనక జంగు, నర్సాపూర్ చెందిన గాండ్ల విజయ్, రెబ్బనపల్లి చెందిన బండ రాకేష్, గూడెం చెందిన గోపతి సునితలను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లక్షెట్టిపేట రూరల్, జూన్ 15: మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ ఆదాయం రెండు కోట్లకు పైగా రాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదు కట్లకు పైగా ఆదాయం వచ్చిందని, అవినీతికి పాల్పడకుండా బాధ్యతతో పని చేయాలని సూచించారు. సమస్యలను దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ కల్లెడ చంద్రశేఖర్ మున్సిపాలిటీకి వచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి పనులు సంబంధిత పనుల ఖర్చులు సమావేశంలో వివరించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాలకవర్గానికి వివరించారు. పాలకవర్గం ఎమ్మెల్యేను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా ప్రణాళిక

ఏసీసీ, జూన్ 15: ఎన్‌పీడీసీఎల్ మంచిర్యాల సర్కిల్ పరిధిలో జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని సూపరింటెండెంట్ ఇంజనీర్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల్లో భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం, గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడడం, రైతులు స్విచ్‌బోర్డు, మోటారు స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు, ఎర్తింగ్ పాటించకపోవడం వల్ల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనుమతి కలిగిన అధికారి మాత్రమే లైన్‌క్లియర్ ఇవ్వాలని, ఫోన్ ద్వారా లైన్ క్లియర్ ఇవ్వడాన్ని నివారించాలని, సీనియర్ లైన్‌మెన్, లైన్‌మెన్ వర్కు లోకేషన్ వద్ద ఉండాలని సూచించారు. ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రత పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఆన్‌లైన్ ప్రకియను పరిశీలించిన ఎంపీడీవో

తాండూర్, జూన్ 15: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మీ పథకం కింద రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌లకు దరఖాస్తు చేసుకుని అమలు కాని లబ్ధిదారుల ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. లబ్ధిదారులు ఎవరు అధైర్యపడవద్దని సూచించారు.

పండ్ల పంపిణీ

మందమర్రిటౌన్, జూన్15: మనో వికాస్ మానసిక వికలాంగుల పాఠశాలలో శనివారం పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్ కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పండ్లు, కేక్, బిస్కెట్లు పంపిణీ చేశారు.

నీటి సరఫరాలో నేడు అంతరాయం

ఏసీసీ, జూన్ 15: మంచిర్యాల పట్టణంలోని హమాలీ వాడ 16వ వార్డు అశోక్‌రోడ్డుకు వెళ్లే దారిలో రైల్వే శాఖ డ్రైన్ నిర్మాణం చేపడుతున్నందున ఆదివారం వార్డులో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ వార్డుకు వెళ్లే పైపులైన్ పగిలిపోయిందని, మరమ్మతులో భాగంగా నీటి సరఫరాను నిలిపివేయనున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

